సాక్షి తూర్పుగోదావరి


శనివారం । 16 । మార్చి । 2024



మళ్లీ పాత చోటుకు

రత్నగిరి వాసుడు సత్యదేవునికి నైవేద్యాలు తయారు చేసే నివేదన శాలను మళ్లీ పాత ప్రదేశంలోనే ఆలయ ప్రాకారం లోపల ఏర్పాటు చేయనున్నారు.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని వదిలారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని (సా॥)	సెహరీ ఆది (ఉ॥)
రాజమహేంద్రవరం	6.22	4.49
కాకినాడ	6.22	4.49
అమలాపురం	6.22	4.49

న్యూస్‌రీల్

శాస్త్రవేత్తల పర్యటన



కడియంలో పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కడియం: ఏరువాక కేంద్రం **రాజమహేంద్రవరం** కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా **వెంకటనరసింహారావు,** సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అచ్యుతరాజులు కడియం, రాజానగరం, అనపర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో వివిధ పంటలను పరిశీలించారు. కడియంలో శుక్రవారం వరి పంటలను పరిశీలించిన సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ, ప్రస్తుతం దాళ్వా వరి పంట గింజ పాలు పోసుకునే దశలో ఉందని చెప్పారు. చీడపీడల ఉధృతి లేనందున దిగుబడులు ఆశాజనంగానే ఉంటాయని ఆశిస్తున్నామని చెప్పారు. అక్కడక్కడ కాండం తొలిచే పురుగు, ఆకుడముడత పురుగులను గుర్తించామన్నారు. వీటి నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్ల మందును లీటరు నీటికి కలిపి, పిచికారీ చేసుకోవాలని సూచించారు. దోమ పోటు, పురుగుల సంఖ్యను బట్టి మాత్రమే పురుగు మందులు వాడాలన్నారు. సుడిదోమ నివారణకు ట్రైఫ్లుమిజోపెరిమ్ వినియోగించాలని సూచించారు. అలాగే కడియం పరిసర ప్రాంతాల్లో సార్వా వరి తరువాత బంతి సాగు చేసిన రైతులతో చర్చించారు. కూరగాయలు, మిరప, బెండలో చీడపీడల నివారణకు సూచనలు చేశారు. మిరపలో పైముడతకు కారణమైన తామర పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2 మిల్లీలీటర్ల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వారి వెంట వ్యవసాయ, ఉద్యాన అధికారులు కె.ద్వారకాదేవి, డి.సుధీర్‌కుమార్, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

డైట్ ప్రిన్సిపాల్ బదిలీ



రమణను సత్కరిస్తున్న సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎస్‌డీవీ రమణ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ (సమగ్ర శిక్ష) డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఏఎం జయశ్రీ డైట్ ప్రిన్సిపాల్‌గా బదిలీపై వస్తున్నారు. డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ అయిన రమణను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఛాత్రోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

జిల్లా పశు సంవర్ధక అధికారిగా శ్రీనివాసరావు



కలెక్టర్ మాధవీలతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా టి.శ్రీనివాసరావు శుక్రవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా తాడికొండ ఏరియా వెటర్నరీ ఆసుపత్రిలో సహాయ సంచాలకునిగా పని చేస్తున్న ఆయన ఉప సంచాలకునిగా పదోన్నతి పొంది, జిల్లా పశు సంవర్ధక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ మాధవీలతను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పాలవెల్లువ సేకరణ కేంద్రాల ద్వారా పెద్ద ఎత్తున అమూల్ బల్క్ మిల్క్ యూనిట్లకు పాల సేకరణ లక్ష్యాలను నిర్దేశించామని తెలిపారు. ఆ మేరకు ప్రతి రోజూ ఆయా కేంద్రల నుంచి లీటర్ల పాలు సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో కొవ్వూరు డివిజన్ పశు సంవర్ధక అధికారి జి.రాధాకృష్ణ కూడా ఉన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఈ నెల 1 నుంచి జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగంలో రసాయన శాస్త్రం, కామర్స్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 52 కేంద్రాల్లో జరిగాయి. పరీక్షల నిర్వహణకు 800 పైగా సీసీ కెమెరాలను ఉపయోగించారు. 2 వేల మందికి పైగా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పని చేశారు. జనరల్ పరీక్షలన్నీ ముగియగా, 16, 18 తేదీల్లో బ్రిడ్జి కోర్సుల పరీక్షతో మొత్తం ఈ ప్రక్రియ ముగియనుంది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆర్‌జేడీ శారద, ఆర్ఐఓ నరసింహం బృందాలు నిత్యం పర్యవేక్షించాయి. ఈ నెల 18 నుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్పాట్ వాల్యుయేషన్ నిర్వహించనున్నారు.

మేం రెడీ

- నేడే ఎన్నికల షెడ్యూల్
- ఏర్పాట్లలో అధికార యంత్రాంగం తలమునకలు
- విస్తృతంగా శిక్షణలు, సమీక్షలు
- నిఘా నీడన నిర్వహణ
- జిల్లాల సరిహద్దుల్లో ఇప్పటికే చెక్‌పోస్టులు
- మద్యం, నగదు అక్రమ రవాణాపై కన్ను
- లైసెన్స్ తుపాకులు స్వాధీనం
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు

పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లపై పరిశీలన

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై అధికారులు ఇప్పటికే విస్తృత పరిశీలన జరిపారు. వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేశారు. కలెక్టర్లు స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలతో పాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) పనితీరు, ఓటర్ వెరిఫయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్ (వీవీ ప్యాట్లు), కంట్రోల్ యూనిట్లను పరిశీలించారు. ఎన్నికల విధుల కోసం అధికారులు, సిబ్బంది నియామకంతో పాటు వారికి వివిధ దశల్లో శిక్షణలు కూడా పూర్తి చేశారు.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణ అంటేనే ఒక మహాయజ్ఞం. ఇటు అభ్యర్థులు విజయమే లక్ష్యంగా ప్రతి అడుగూ వేస్తుంటారు. అటు అధికార యంత్రాంగం కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా.. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు నానా హైరానా పడుతూంటారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం విడుదల కానుంది. ఈ తరుణంలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు చేయాల్సిన ఏర్పాట్లలో కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల అధికార యంత్రాంగాలు కొన్నాళ్లుగా తలమునకలవుతున్నాయి. నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలా సిద్ధం అంటున్నాయి.

ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు అవసరమైన అధికారులను, సిబ్బందిని నియమించారు. జిల్లాల ఎన్నికల అధికారులైన కలెక్టర్లతో పాటు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ఓటర్ల నమోదు.. మార్పులు.. చేర్పులు.. ఓటర్ల తుది జాబితా తయారీ.. విస్తృత సమీక్షలు.. శిక్షణలు.. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడం.. ఓటర్లను చైతన్యపరచడం.. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు.. నామినేషన్లకు అవసరమైన ఏర్పాట్లు.. ఈ ప్రక్రియపై సంబంధిత అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించడం వంటి అనేక కార్యక్రమాల్లో మునిగి తేలుతున్నారు.


మరోవైపు పోలీసు యంత్రాంగం కూడా బందోబస్తు ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందించుకుంటోంది. డబ్బు, మద్యం, ఇతర సామగ్రి అక్రమంగా రవాణా కాకుండా జిల్లాల సరిహద్దుల్లో ఇప్పటికే చెక్ పోస్టులు ఏర్పాటు చేసింది. నిఘా కట్టుదిట్టం చేసింది. గత ఎన్నికల సందర్భంగా గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారించింది. రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు విఘాతం కల్పించే అవకాశం ఉన్నవారి కదలికలపై కన్ను వేసింది. ఈ ప్రాంతాలతో పాటు, ఇతర పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లపై ప్రణాళికలు రూపొందిస్తోంది.

కట్టుదిట్టంగా ఎన్‘ఫోర్స్’మెంట్

- ఈసారి ఎన్నికల్లో నిఘా మరింత విస్తృతం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సూక్ష్మ స్థాయిలో కూడా గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నారు.
- ఎన్నికల నిర్వహణలో ప్రతి ప్రక్రియ క్షణాల్లో కళ్ల ముందు ఉండేలా భారీగా వెబ్ కాస్టింగ్ (వెబ్ కెమెరాలు) ఏర్పాటు చేస్తున్నారు. కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో మొత్తం 4,850 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2,426 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అంటే దాదాపు సగం పోలింగ్ కేంద్రాలు పూర్తి స్థాయి నిఘా నీడలో ఉండనున్నాయి. తద్వారా వీటిల్లో ఎక్కడ ఏ చిన్న అవాంఛనీయ సంఘటన చోటు చేసుకున్నా విజయవాడలోని ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులు వెంటనే గుర్తించి, తక్షణ చర్యలు తీసుకునే అవకాశం కలగనుంది.
- వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల మధ్య పరస్పర సమన్వయానికి ఆన్‌లైన్ ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్)ను ఎన్నికల కమిషన్ రూపొందించింది. ఇందులో పోలీసు, ప్రొహిబిషన్, ఇన్‌కంట్యాక్స్, కమర్షియల్ ట్యాక్స్, రవాణా, స్టేట్ ఆడిట్, అటవీ శాఖ, ఎస్ఈబీ, కోస్ట్ గార్డ్, బ్యాంకుల నోడల్ అధికారులు విధిగా నమోదు కావాలని ఆదేశించారు. ఆయా శాఖల పరిధిలో ఎన్నికలకు సంబంధించిన అక్రమ, అనుమానాస్పద కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఆయా అంశాలపై ఎన్నికల కంట్రోల్ రూముకు ఎప్పటికప్పుడు సమాచారం అందించడంతో పాటు రోజువారీ నివేదికలు పంపిస్తారు.
- అన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు తమ విభాగాల్లో క్విక్ రెస్పాన్స్ టీములు, ర్యాపిడ్ యాక్షన్ టీములు ఏర్పాటు చేయాలని, వాటిని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వేలెన్స్ టీములతో అనుసంధానం చేయాలని ఆదేశించారు.
- రూ.లక్షకు మించి జరిగే సందేహాస్పద లావాదేవీలు, ఒకే అకౌంట్ నుంచి వివిధ ఖాతాలకు అసాధారణ రీతిలో జరిగే లావాదేవీల సమాచారాన్ని బ్యాంకులు విధిగా ఈఎస్ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలి. రూ.10 లక్షలకు మించి జరిగే లావాదేవీలను ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులకు తెలియజేయాలి.
- మద్యం డిపోల్లో విక్రయాలను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎలక్షన్ సెంట్రల్ కంట్రోల్ రూము పరిశీలనకు అనుసంధానం చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది.



కేంద్ర పోలీసు బలగాల కవాతు



జిల్లాల వారీగా వెబ్ కాస్టింగ్

జిల్లా	నియోజకవర్గాలు	పోలింగ్ కేంద్రాలు	వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినవి
కాకినాడ	7	1,637	819
తూర్పు గోదావరి	7	1,644	822
కోనసీమ	7	1,569	785
మొత్తం	21	4,850	2,426

సమస్యాత్మక కేంద్రాలపై దృష్టి

ఈ మూడు జిల్లాల్లోనూ సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే అధికారులు గుర్తించారు. వీటిలో అత్యంత సమస్యాత్మక కేంద్రాల పరిధిలో ఇప్పటికే కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహిస్తున్నారు. పక్షం రోజులుగా ఆయా జిల్లా ఎస్పీలు సమస్యాత్మక, అతి సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటిస్తూ స్థానిక పరిస్థితులపై ఒక అవగాహనకు వచ్చారు. రౌడీ షీటర్లు, బైండోవర్ కేసులున్న వారికి ఇప్పటికే నోటీసులు కూడా జారీ చేశారు. లైసెన్స్ కలిగి ఉన్న రివాల్వర్లు, తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఇటువంటి చర్యల ద్వారా ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా ధైర్యాన్ని అందిస్తున్నారు. దీంతో పాటు పోలింగ్ శాతం పెరిగేలా ప్రజల్లో అవగాహన పెంపొందించే ప్రక్రియను చేపట్టారు.

24/7 నిఘా

మూడు జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు ఇప్పటికే చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి వాహనాన్నీ నిశితంగా తనిఖీ చేస్తున్నారు. ఇటు కాకినాడ, అటు కోనసీమ జిల్లాల సరిహద్దున కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పరిధిలోని యానాం ప్రాంతం ఉంది. దీంతో అక్కడి అధికారులతో ఈ రెండు జిల్లాల అధికారులు, పోలీసులు సమన్వయం చేసుకుంటూ మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల వేళ మద్యం, కట్టలు తెంచుకునే కరెన్సీ నోట్లను కట్టడి చేయడం పోలీసులకు కత్తి మీద సాములానే ఉంటుంది. యానాం నుంచి మద్యం కాకినాడ, కోనసీమ జిల్లాల్లోకి రాకుండా పోలీసులు ప్రత్యేకంగా తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

- జిల్లాల సరిహద్దుల్లో పోలీసులు 24/7 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, వాహనాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. నగదు, మద్యం, బంగారం రవాణాపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ముఖ్యంగా యానాం సరిహద్దున ఎదుర్లంక, దిండి - చించినాడ, కాకినాడ ముఖద్వారం ఇంద్రపాలెం లాకులు, తుని, రాజానగరం సమీపాన తూర్పు గోనగూడెం, కొవ్వూరు తదితర ప్రాంతాల్లో ఈ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



త్వరలో జరగనున్న ఎన్నికలు స్వేచ్ఛాయుతమైన వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. నగదు, మద్యం, ఇతర ప్రలోభాల పంపిణీని సమర్థంగా నియంత్రించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు వెళుతున్నాం. ఓటర్లను ప్రభావితం చేసే ఎటువంటి చర్యలనైనా కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వేలెన్స్ బృందాలను నియమిస్తున్నాం. చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల జిల్లా అధికారులందరూ సమన్వయంతో పని చేస్తున్నారు. ఓటింగ్ శాతం పెంచేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాం. నూరు శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ కె.మాధవీలత,
జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్,
తూర్పు గోదావరి జిల్లా

జెడ్ స్పేస్ సెంటర్‌తో ఆర్ట్స్ కళాశాల ఒప్పందం



జెడ్ స్పేస్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): నగరంలోని ప్రభుత్వ అటానమస్ కళాశాల నూతన మైలు రాయిని చేరుకుంది. ముంబైలోని ఐడీఏ బిజినెస్ సొల్యూషన్స్‌తో భాగస్వామి అయ్యేలా శుక్రవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీనిలో భాగంగా కళాశాల రసాయన శాస్త్ర విభాగంలో జెడ్ స్పేస్ ఇన్‌స్పైర్ ప్రో లాప్టాప్ స్టేషన్ ఏర్పాటుకు ఇరు పక్షాల మధ్య ఈ ఒప్పందం కుదిరింది. జెడ్ స్పేస్ ఇన్‌స్పైర్ ప్రో లాప్టాప్ స్టేషన్‌లో వీఐవీఐడీ కెమిస్ట్రీ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఈ-కంటెంట్ రూపొందించడంపై రసాయన శాస్త్ర అధ్యాపకులకు ప్రయోగాత్మక శిక్షణను నిర్వహించారు. ఉన్నత విద్యా శాఖ కమిషనర్ ఆదేశం మేరకు బోధన, అభ్యసన ప్రక్రియలోకి ఈ సాంకేతికతను తీసుకుని వచ్చారు. దీనికి అవసరమైన వర్క్ స్టేషన్ పరికరాలు సమకూర్చుకునేందుకు కళాశాల నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా రూ.10 లక్షలు కేటాయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్ర మాట్లాడుతూ, డిజిటల్ టెక్నాలజీ ఆధారిత అభ్యసనం విద్యార్థుల్లో ఉత్సుకతను పెంపొందించడానికి సహకరిస్తుందని అన్నారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ సాంకేతికతల ద్వారా శిక్షణ రూపకల్పన, విజువలైజేషన్ అనుభవాలను మెరుగుపరచుకోవడానికి ఉపకరిస్తుందని వివరించారు. జెడ్ స్పేస్ ఇంక్ ప్రతినిధి సచిన్ మహేందు మాట్లాడుతూ, మిక్స్‌డ్ రియాలిటీ, ఏఆర్, వీఆర్ ద్వారా విద్యార్థుల అభ్యసన అనుభవాలను జెడ్ స్పేస్ శక్తిమంతం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల నైపుణ్య కేంద్రం కో ఆర్డినేటర్ వెంకటరావు, వైస్ ప్రిన్సిపాల్ శాస్త్రి, అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ సంజీవ్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ అన్నపూర్ణ, రసాయన శాస్త్ర విభాగాధిపతి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కేశవరావు

రాజానగరం: కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలపై అవగాహన పెంచుకుని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గోదావరి కేశవరావు అన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి జిల్లా శాఖ ఆధ్వర్యాన స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో సామాజిక తనిఖీ, ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఇందులో సహాయ కార్మిక అధికారి ఎం.లలిత కుమారి, ఎస్‌ఆర్‌పీ బి.తులసీ నాయక్, డీఆర్‌పీ ఎస్.రేణుకలక్ష్మి పాల్గొన్నారు.

కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడిగా రాజీవ్ కృష్ణ



కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడిగా ఎస్.రాజీవ్‌కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. రాజీవ్‌కృష్ణ ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, రాష్ట్ర పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ సలహాదారుగా పని చేస్తున్నారు. గతంలోనూ ఆయన ఇక్కడ పరిశీలకుడిగా పని చేశారు.

ఆదిలోనే హంసపాదు

- కొవ్వూరులో ముప్పిడి పరిచయ సభకు జవహర్ వర్గీయుల డుమ్మా
- పత్తా లేని బీజేపీ, జనసేన నాయకులు
- కానరాని టీడీపీ ఆశావహులు

కొవ్వూరు: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుకు కొవ్వూరులో ఆదిలోనే హంసపాదు ఎదురైంది. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన పరిచయ కార్యక్రమం నిర్వహించారు. దీనికి బీజేపీ, జనసేన నేతలతో పాటు మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ వర్గీయులు, టీడీపీ ఆశావహులు డుమ్మా కొట్టారు. తద్వారా రానున్న ఎన్నికల్లో ముప్పిడికి సహకరించేది లేదని చెప్పకనే చెప్పారు. మూడు పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా కొవ్వూరు నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్న వెంకటేశ్వరరావు నిర్వహించిన మొదటి సభలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావుతో పాటు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఇతర ముఖ్య నాయకులు, టీడీపీ ఆశావహులు పత్తా లేకపోవడం చర్చనీయాంశమైంది. వెంకటేశ్వరరావు తన ప్రసంగంలో మూడు పార్టీలు అంటూ పదేపదే ప్రస్తావించినప్పటికీ ఈ సభకు టీడీపీలోని కొంత మంది నాయకులు మాత్రమే హాజరు కావడం ఆ పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. ఇప్పటికే తాను పోటీలో ఉంటానని మాజీ మంత్రి కేఎస్ జవహర్ ప్రకటించడం, ఆయనకు పార్టీ ఆశావహులు జత కలవడం టీడీపీని కలవరపరుస్తోంది. ఈ ఎన్నికల్లో కొవ్వూరు నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న తలారి వెంకట్రావు ప్రస్తుతం గోపాలపురం ఎమ్మెల్యే కూడా. గత ఎన్నికల్లో ఆయన చేతిలో ముప్పిడి 36 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అటువంటి అభ్యర్థిని తిరిగి కొవ్వూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా అది కూడా తలారి వెంకట్రావు పైనే పోటీకి దింపడమేమిటంటూ టీడీపీ శ్రేణులు తల పట్టుకుంటున్నాయి. తాజా పరిణామాలతో ఆ పార్టీ శ్రేణులు అయోమయంలో పడ్డాయి. వైఎస్సార్ సీపీ అభ్యర్థి తలారి వెంకట్రావు ఇప్పటికే ఇంటింటి ప్రచారంతో ప్రజల్లోకి దూసుకుపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని ఎదుర్కోవడం కష్టమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

టీడీపీ సభలో జాడలేని మిత్రపక్షాలు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని డీ మార్ట్ పక్కన ఖాళీ స్థలంలో రూరల్ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆధ్వర్యాన శుక్రవారం రాత్రి నిర్వహించిన జయహో బీసీ బహిరంగ సభ తూతూమంత్రంలా జరిగింది. టీడీపీ, జనసేన, బీజేపీలు ఉమ్మడిగా నిర్వహించిన ఈ సభలో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్న పాత్రుడు, బీసీ నాయకులు కాదా వెంకట రమణ, వినుకొండ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 4 గంటలకు ప్రారంభం కావాల్సిన ఈ సభ జనం లేకపోవడంతో రాత్రి 7.30 గంటలకు మొదలైంది. వేదికను టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలతో అలకరించారు. కానీ జనసేన, బీజేపీ నుంచి ఒక్క నాయకుడు కూడా హాజరు కాలేదు. టీడీపీ నాయకులతోనే ఈ సభను ముగించారు. జయహో బీసీ అని పేరు పెట్టినప్పటికీ బీసీలతో పాటు, అగ్ర వర్ణాలు, ఎస్సీ వర్గానికి చెందిన టీడీపీ కార్యకర్తలందరినీ బస్సుల్లో సభాస్థలికి తరలించారు.

20న అయోధ్యకు బస్సు

కాకినాడ: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఈ నెల 20న అయోధ్యకు సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ శుక్రవారం తెలిపారు. ఈ బస్సు 20న కాకినాడలో బయలుదేరి పూరి, కోణార్క్, భువనేశ్వర్, సాక్షి గోపాలం, జాజిపూర్, గయ, వారణాసి, ప్రయాగ్‌రాజ్, అ యోధ్య, నైమిశారణ్యం, సీతామడి క్షేత్రాలను చూపించి, తిరిగి 30వ తేదీన కాకినాడ చేరుతుందని వివరించారు. ప్రతి రోజూ ఫలహారం మధ్యాహ్నం, రాత్రి భోజనంతో కలిపి టికెట్టు రూ.12 వేలుగా నిర్ణయించామన్నారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నాగమణి



నాగమణిని అభినందిస్తున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్

గోకవరం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా గోకవరం మండలం కొత్తపల్లికి చెందిన డాక్టర్ ప్రగళ్లపాటి నాగమణి శుక్రవారం విజయవాడలో ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ రెడ్డి ఆధ్వర్యాన ఆమె ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా నాగమణి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించారని, ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి, కార్పొరేషన్ ఫలాలు ఆర్యవైశ్యులకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఆమెను ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ప్రగళ్లపాటి కనకరాజు, డైరెక్టర్లు హారిక, ప్రవల్లిక, కొత్త సంతోష్, అగ్రహారపు సంతోష్, పి.అనురాధకృష్ణ, గుండు సుబ్బలక్ష్మీతాయారు తదితరులు అభినందించారు.

రేపు గ్రూప్-1 పరీక్షలు

- 8,258 మంది అభ్యర్థులు
- 25 కేంద్రాలు ఏర్పాటు
- జేసీ తేజ్‌భరత్ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని 25 కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షలు ఆదివారం నిర్వహించనున్నామని ఏపీపీఎస్సీ నోడల్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై కలక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మెడికల్ క్యాంపులు తదితర ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పేపర్-2 జరుగుతాయని వివరించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, అభ్యర్థుల మొబైల్ ఫోన్లు భద్రపరిచేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా రూట్లలో బస్సులు, ఆటోలు అందుబాటులో ఉండేలా ఆర్టీసీ, రవాణా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. 25 కేంద్రాల్లో 25 మంది జిల్లా స్థాయి అధికారులను నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమావేశంలో డీఆర్ఓ జి.నరసింహులు, అదనపు ఎస్పీ పి.అనిల్ కుమార్, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ సందు సాయి ప్రకాష్, కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఆదివారం అండర్–20 విభాగంలో బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు జి.ఎలీషాబాబు శుక్రవారం తెలిపారు. కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఎంపికలకు 2004–07 సంవత్సరాల మధ్య జన్మించినవారు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు చిత్తూరు జిల్లాలో ఈ నెల 20న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

మహిళ దారుణ హత్య


ఘటనా స్థలంలో కుమారి మృతదేహం

పిఠాపురం: తనతో సహజీవనం చేస్తున్న మహిళను ఒక వ్యక్తి దారుణంగా హత్య చేసిన ఘటన గొల్లప్రోలు మండలం చెందుర్తిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. గొల్లప్రోలు ఎస్సై బాలాజీ కథనం ప్రకారం చెందుర్తికి చెందిన తాటిపర్తి కనక లింగేశ్వరరావు అదే గ్రామానికి చెందిన అయినవిల్లి కుమారి (48)తో కొన్నేళ్లుగా సహ జీవనం చేస్తున్నాడు. కొంత కాలంగా ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. తరచూ ఇద్దరు గొడవ పడుతుండేవారు. ఈ నేపథ్యంలో గురువారం అర్ధరాత్రి ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో కోపోద్రిక్తుడైన నిందితుడు కనక లింగేశ్వరరావు మడత మంచం పట్టి కర్రతో ఆమెను బలంగా కొట్టాడు. దీంతో ఆమె తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడిగా డీబీ లోక్


డీబీ లోక్

అమలాపురం టౌన్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ) న్యూఢిల్లీ సెంట్రల్ కమిటీ అమలాపురానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు, న్యాయవాది డీబీ లోక్‌ను ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షుడిగా నియమించింది. ఈ మేరకు సెంట్రల్ కమిటీ ఆర్పీఐ (కె) జాతీయ అధ్యక్షుడు సునిల్ రామ్‌టేకే నుంచి లోక్ నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఈ మేరకు లోక్ అమలాపురంలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అమలాపురంలో సీనియర్ న్యాయవాది అయిన లోక్ ఆర్పీఐలో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పలు పదవులు నిర్వహించారు. ఈయన గతంలో అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పనిచేశారు. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్య వేదిక చైర్మన్‌గా పనిచేస్తున్నారు. కోనసీమ జిల్లాకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా పేరు పెట్టాలని అంబేడ్కర్ జిల్లా సాధన కమిటీ చైర్మన్‌గా కూడా పనిచేసి ఆ విషయంలో విజయం సాధించారు.

మళ్లీ పాత చోటుకు

- ఆలయ ప్రాకారం లోపలే సత్యదేవుని నివేదన శాల
- చురుకుగా సాగుతున్న నిర్మాణ పనులు
- గత ఏడాది ఆలయ ప్రాకారం వెలుపల నివేదనశాల మార్పు
- ఇందుకు దాత రూ.30 లక్షలు విరాళంగా సమర్పణ



అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవునికి నైవేద్యాలు తయారు చేసే నివేదన శాలను మళ్లీ పాత ప్రదేశంలోనే ఆలయ ప్రాకారం లోపల ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సత్యదేవునికి సాధారణ రోజుల్లో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వివిధ నైవేద్యాలను నివేదన శాలలో శుచిగా వండి, మడిగా ఆలయానికి తీసుకుని వెళ్లి అర్చకస్వాములు స్వామివారికి నివేదిస్తారు. అదే ఏకాదశి, జన్మ నక్షత్రం మఖ, ఇతర పర్వదినాల్లో ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మళ్లీ నివేదనలు సమర్పిస్తారు. ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్న అర్చకులు, వ్రత పురోహితులు సుమారు 60 మందికి నివేదన శాలలోనే మధ్యాహ్నం భోజనాలు పెడతారు. ఇందుకు అవసరమైన సామగ్రిని దేవస్థానం స్టోర్స్ నుంచి ప్రతి నెలా పంపిస్తారు.


ఆలయ ప్రాకారం లోపల పాత ప్రదేశంలో నిర్మించిన నివేదన శాల


గత ఏడాది సర్క్యులర్ మంటపంపై నిర్మించిన నివేదన శాల

కొత్తగా సర్క్యులర్ మంటపం మీద..

సుమారు పది నెలల క్రితం వరకూ సత్యదేవుని నివేదన శాల ఆలయం కుడివైపు దిగువన ఆలయ ప్రాకారానికి చేర్చి ఉండేది. అక్కడే స్వామి వారికి నివేదనలు తయారయ్యేవి. అదేవిధంగా అర్చకులు, పురోహితులకు భోజనాలు తయారు చేసేవారు. అయితే, అప్పటి ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ భక్తుల కోసం వ్రత మంటపాల దిగువన క్యూ తో కూడిన కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసేందుకు నివేదన శాలను సర్క్యులర్ మంటపం మీద నిర్మించారు. దీనికి తునికి చెందిన దాత చెక్కా తాతబాబు సుమారు రూ.30 లక్షల విరాళం సమర్పించారు. ఈ విధంగా నివేదన శాలను మార్పు చేయడం శాస్త్ర సమ్మతమేనని అప్పట్లో దేవస్థానం వైదిక కమిటీ నివేదిక సమర్పించింది. దీంతో గత సెప్టెంబర్ నుంచి సత్యదేవునికి నివేదనలు ఇక్కడే తయారు చేస్తున్నారు. అర్చకులు, పురోహితులకు కూడా ఇక్కడే భోజనాలు తయారు చేసి పెడుతున్నారు.

ఈవో మారాక మళ్లీ పాత చోట

గత నవంబర్‌లో దేవస్థానం ఈఓగా బాధ్యతలు స్వీకరించిన దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ నివేదన శాల ఆలయానికి చేరువలో ప్రాకారం లోపల మాత్రమే ఉండాలని, దీనిని మళ్లీ పాత ప్రదేశంలోనే నిర్మించాలని ఆదేశించారు. దీంతో మళ్లీ పాత ప్రదేశంలోనే నివేదన శాల నిర్మాణ పనులు ప్రారంభించారు. కిచెన్, హాలు నిర్మాణం ఇప్పటికే పూర్తి చేశారు. లోపల పొయ్యిలు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ పనులు మరో వారం రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. నివేదన శాల ఆలయ ప్రాకారంలోనే ఉండాలని, అందువలన దానిని పాత భవనంలోకే మారుస్తున్నట్టు దాత చెక్కా తాతబాబుకు తెలియజేస్తామని దేవస్థానం అధికారులు తెలిపారు.

శాస్త్ర సమ్మతం కాదు



స్వామివారి నివేదన శాల ఆలయం వెలుపల ఉండడం శాస్త్ర సమ్మతం కాదు. ఇది ఆలయ ప్రాకారంలోనే ఉండాలి. భక్తులు చూడకుండా నివేదనలను అర్చకులు స్వామివారి ఆలయానికి తీసుకుని వెళ్లాలి. తిరుమలలో ఆలయానికి చేర్చే నివేదన శాల ఉంటుంది. సింహాచలంలో కూడా అలాగే ఉంటుంది. అన్నవరంలో మాత్రం ఆలయ ప్రాకారంలో కాకుండా వెలుపల నిర్మించారు. అందువలన దీనిని ప్రాకారం లోపల పాత ప్రదేశంలోనే తిరిగి నిర్మించాం. త్వరలోనే అక్కడ నివేదనలు తయారు చేయించి, స్వామివారికి నివేదిస్తాం.
– కె.రామచంద్ర మోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కృష్ణ కామేశ్వర్

తపాలా బిళ్లల సేకరణలో సాధించిన రికార్డు



అమలాపురం టౌన్: ఒక పైసా నుంచి రూ.రెండు ముఖ విలువ ఉన్న తపాలా బిళ్లలను అత్యధికంగా సేకరించినందుకు అమలాపురానికి చెందిన తపాలా బిళ్లల, నాణేల, కరెన్సీ నోట్ల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ పేరు లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్‌లో మరోసారి నమోదైంది. గతంలో కృష్ణ కామేశ్వర్ పేరిట 77 తపాలా బిళ్లలతో నమోదైన రికార్డును ఇప్పుడు 216 తపాలా బిళ్లల సేకరణ రికార్డుగా ఆ సంస్థ సవరించింది. సాధారణంగా లిమ్కా పుస్తకంలో ఒకే పేజీలో పది రికార్డులు పొందు పరిచే ఆ సంస్థ ఈ సంవత్సరం విడుదల చేసిన పుస్తకంలో ఈ రికార్డును ప్రత్యేకించి ఓ పేజీలో (పి.నెం.37) నమోదు చేసింది. కృష్ణ కామేశ్వర్ గతంలో కరోనా నాణేల సేకరణలో లిమ్కా రికార్డు పొందారు. కరోనా వ్యాధిపై 15 దేశాలు విడుదల చేసిన 18 నాణేలను సేకరించినందుకు గాను 2023లో లిమ్కా రికార్డును సొంతం చేసుకున్నారు. ఆ రికార్డును ఈ సంవత్సరం కూడా పదిలంగా ఉన్నట్లుగా లిమ్కా సంస్థ 2024లో విడుదల చేసిన పుస్తకంలో పేర్కొందని కృష్ణ కామేశ్వర్ తెలిపారు. ఆయన ఈ లిమ్కా రికార్డు సాధించడంపై సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు ఆకొండి పవన్‌కుమార్, అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, వాకర్స్ డిప్యూటీ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, జిల్లాలోని నాణేల, తపాలా బిళ్లల సేకరణ కర్తలు హర్షం వ్యక్తం చేశారు.

నేడు ప్రసాదం స్టాల్ ప్రారంభం


సత్యదేవుని నమూనా ఆలయం వద్ద ప్రసాదం కౌంటర్

అన్నవరం: జాతీయ రహదారిపై స్థానిక డిగ్రీ కళాశాల సమీపంలో విశాఖపట్నం– రాజమహేంద్రవరం వైపు దేవస్థానం స్థలంలో నిర్మిస్తున్న సత్యదేవుని నమూనా ఆలయం వద్ద స్వామివారి ప్రసాదం స్టాల్‌ను శనివారం ఉదయం 10.24 గంటలకు దేవదాయ, ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించనున్నారు. ఈ ప్రసాదం స్టాల్‌ను శుక్రవారం ప్రారంభించాల్సి ఉంది. అయితే మంత్రి ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉండడం వల్ల ప్రారంభోత్సవం వాయిదా పడింది. మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం ఉదయం తాడేపల్లిగూడెం నుంచి నేరుగా అన్నవరంలోని నమూనా ఆలయ నిర్మాణ స్థలం వద్దకు చేరుకుంటారు. అక్కడ ప్రసాదం స్టాల్ ను ప్రారంభించిన అనంతరం రత్నగిరికి చేరుకుని సత్యదేవుని దర్శించి పూజలు చేస్తారు. తరువాత తలుపులమ్మ లోవ దేవస్థానానికి బయలుదేరి వెడతారని అధికారులు తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నం వైపు ప్రయాణించే జాతీయ రహదారిపై గల సత్యదేవుని ప్రసాదం స్టాల్‌లో సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం విక్రయిస్తున్నారు. అయితే విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు జాతీయ రహదారిపై ప్రయాణించే భక్తులు స్వామివారి ప్రసాదాలను కొనుగోలు చేసేందుకు జాతీయ రహదారిని దాటి ప్రసాదాల కౌంటర్ వద్దకు రావల్సి వస్తోంది. ఈ సమయంలో వాహనాలు ఢీ కొట్టడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక డిగ్రీ కళాశాల వద్ద విశాఖపట్నం– విజయవాడ రహదారిని ఆనుకుని అక్కడే ప్రసాదం స్టాల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ తరువాత సత్యదేవుని నమూనా ఆలయం కూడా నిర్మించాలని నిర్ణయించారు. వీటితో బాటు వివిధ షాపులు, క్యాంటీన్, టాయిలెట్స్ కూడా నిర్మిస్తున్నారు. కాగా, ప్రసాదం స్టాల్ ప్రారంభోత్సవం నాలుగు రోజుల ముందు మాత్రమే ఖరారైంది. అప్పటికి స్టాల్‌కు శ్లాబ్ పనులు మాత్రమే అయ్యాయి. దాంతో ఈ నాలుగు రోజుల్లోనే ప్రసాదం స్టాల్ గోడలు నిర్మాణం, ప్లాస్టింగులు, ఫ్లోరింగ్ తదితర పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారు. శనివారం ఉదయానికి మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

గురుకుల జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

రౌతులపూడి: ఎ.మల్లవరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డి.ప్రసాదానం సస్పెండ్ అయిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటీవల కళాశాల ఆవరణలో విద్యార్థుల ఎదురుగా ప్రిన్సిపాల్ మద్యం తాగాడు. ఈ విషయంపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంబంధితశాఖ ఉన్నత అధికారులు విచారణ నిర్వహించగా అతను మద్యం తాగడం వాస్తవమని తేలింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తూ ఈ నెల 5న ఏపీఎస్‌డబ్ల్యూ ఆర్ఈఐఎస్ సెక్రటరీ రావిరాళ్ల మహేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గణిత శాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న కె.రమేష్ ప్రస్తుతం ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

మాజీ మంత్రి ముద్రగడకు ఘన స్వాగతం


ముద్రగడ వైఎస్సార్ సీపీలో చేరడంపై సంబరాలు చేసుకుంటున్న అభిమానులు


కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభంను బైక్ ర్యాలీ మధ్య ఊరేగింపుగా తీసుకొస్తున్న అభిమానులు

కిర్లంపూడి: తాడేపల్లిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరిన కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంకు ఘన స్వాగతం లభించింది. శుక్రవారం సాయంత్రం జగ్గంపేట నియోజకవర్గం చేరుకున్న ఆయనకు, ఆయన కుమారుడు గిరిబాబుకు కిర్లంపూడి, పరిసర ప్రాంతాల నుంచి అభిమానులు చేరుకుని ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్తిపాడు నుంచి భారీ బైక్‌ర్యాలీ నడుమ కిర్లంపూడిలోని ఆయన స్వగృహం వరకు జై జగన్, జై ముద్రగడ అనే నినాదాలతో స్వగృహానికి తీసుకొచ్చారు. ఆయనతో పాటు గణేశుల రాంబాబు, నరిసే శివాజీ, గౌతు స్వామి, గణేశుల లచ్చబాబు ఉన్నారు.

ఆనందంలో అభిమానులు

కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆయన తనయుడు ముద్రగడ గిరిబాబు శుక్రవారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలోకి చేరడంపై కిర్లంపూడిలో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కేక్‌ను కట్ చేసి స్వీట్స్‌ను పంచారు. అపార రాజకీయ అనుభవం కలిగిన ముద్రగడ పద్మనాభం వంటి నాయకుడు వైఎస్సార్ సీపీలోకి చేరడం ఆ పార్టీకి ఎంతో బలం చేకూరుతుందని నాగబాబు అన్నారు. ఉమ్మిడి సత్తిబాబు, యల్లపు నానాజీ, పెంటకోట మూర్తి, పెనగంటి రాజేష్, నక్కా అప్పలరాజు, బంగారు రమణ, మూరా శ్రీను పాల్గొన్నారు.

సమస్త జీవరాశిలో పరమాత్ముని చూడాలి

ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి


అనుగ్రహ భాషణ చేస్తున్న పరిపూర్ణానంద గిరి

అమలాపురం రూరల్: సమస్త జీవరాశిలోను పరమాత్ముని చూసే ప్రయత్నమే ఆధ్యాత్మిక మార్గమని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి అన్నారు. నల్లమిల్లి గ్రామంలో సద్గురు గీతాశ్రమంలో మురళీకృష్ణ మందిరంలో శుక్రవారం స్వామి భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. యజ్ఞయాగాదులు నిర్వహించటం, దానధర్మాలు చేయటం, మంత్రజపం, తపస్సు, సేవ వలన జ్ఞానవైరాగ్యాలు కలుగుతాయని కృష్ణ పరమాత్మ బోధించారని తెలిపారు. కేవలం మానవులలో మాత్రమే కాదు, సమస్త జీవరాశిలోను భగవంతుడిని చూడాలని ఆయన అన్నారు. ఏ జీవికీ మనవల్ల అపకారం జరగకుండా, చేతనైనంత ఉపకారం జరిగేలా జీవించటమే జీవిత పరమార్థమని, అదే అసలైన ధార్మిక మార్గమని ఉపదేశించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పాదపూజలు, తులాభారం నిర్వహించారు. కార్యక్రమంలో మాతా బ్రహ్మానంద గిరి, మాతా ప్రవానంద గిరి, మాతా పరబ్రహ్మానంద గిరి, భక్తులు పాల్గొన్నారు.

సాంకేతిక వాణిజ్యీకరణపై దృష్టి

సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్


సమావేశంలో మాట్లాడుతున్న సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శేషుమాధవ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సాంకేతిక వాణిజ్యీకరణపై సంస్థ దృష్టి సారించిందని ఐసీఏఆర్–సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. శుక్రవారం స్థానిక సీటీఆర్ఐ సెమినార్ హాల్లో ఎన్ఏఐఎఫ్, ఐసీఏఆర్ ఆధ్వర్యంలో సాంకేతిక వాణిజ్యీకరణ (మిర్చి, పసుపు, పొగాకు, అశ్వగంధ, ఆముదం మొదలైనవి)పై ఇనిస్టిట్యూట్–ఇండస్ట్రీట్ మీట్ ఆయన అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ యూనిట్(ఐఎంటీయూ) నిర్వహించిన కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు. సీటీఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ హెచ్.రవిశంకర్ సీటీఆర్ఐ, ఇతర ఐసీఏఆర్ –ఇనిస్టిట్యూట్‌ల సాంకేతికతలు, ఉత్పత్తుల గురించి అవగాహన కల్పించడం, తదుపరి వాటి గురించి చర్చించడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. పరిశ్రమలు, వ్యవస్థాపకులు, ఎఫ్‌పీవోలు, రైతులతో వారి వాణిజ్యీకరణ కోసం పసుపు,మిర్చి, అశ్వగంధంలో పంట విలువ, జోడింపు ఎంపికలు గురించి వివరించారు. ఏపీ మార్కెటింగ్ శాఖ సలహాదారు ఎండీ నసీమ్ అహ్మద్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ కరుణశ్రీ, డా.వైఎస్సార్ హార్టి కల్చర్ యూనివర్సిటీ పసుపు పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ వై.అమరేందర్, ఐటీసీ సీనియర్ మేనేజర్ డాక్టర్ కేవీజీఎస్ మూర్తి, డాబర్ ఇండియా లిమిటెడ్ మాజీ డైరెక్టర్ శాస్త్రి, వేమగిరి డైరెక్టర్ ఆఫ్ ఫ్లోరికల్చర్ రీసెర్చ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ డీవీఎస్ రాజు, కొవ్వూరు హార్టి కల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, సీటీఆర్ఐ విభాగాల అధిపతులు, శాస్త్రవేత్తలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థల సీఈవోలు, వ్యవస్థాపకులు, ఎన్‌జీవో సభ్యులు ,రైతులు, వ్యవసాయ మహిళా రైతులు, ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని వ్యక్తి మృతి

రాజానగరం: కుమార్తెను చూసి వద్దామని బయలుదేరిన తండ్రిని దారి మధ్యలో మృత్యువు లారీ రూపంలో కబళించివేసింది. జాతీయ రహదారి పై స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన దూది రాంబాబు (42), కోరుకొండ మండలం దోసకాయలపల్లిలో ఉంటున్న కుమార్తెను చూసి వద్దామని బైకుపై బయలుదేరాడు. వైఎస్సార్ జంక్షన్ దాటి దోసకాలయపల్లి వెళ్లే రోడ్డుకు వెళ్తున్న సమయంలో రాజమహేంద్రవరం నుంయి వేగంగా వస్తున్న లారీ ఢీ కొనడంతో తలకు బలంగా గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

రైలు నుంచి పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

కొవ్వూరు: తిరుమల ఎక్స్‌ప్రెస్ నుంచి కింద పడిన భీమడోలుకి చెందిన దవులూరి జయసూర్య తీవ్ర గాయాలపాలయ్యారు. రాజమహేంద్రవరానికి చెందిన దుర్గాసి అంజి అనే యువకుడు జయసూర్య సెల్‌ఫోన్ లాక్కుకుని చోరీ చేయడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా జరిగిన పెనుగులాటలో జయసూర్య రైలు నుంచి కింద పడడంతో గాయాలపాలైనట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఇన్‌స్పెక్టర్ జి.శ్రీహరిబాబు, గవర్నమెంటు రైల్వే పోలీసు సీఐ ఎస్.శంకర్ తెలిపారు.

కోకో గింజల చోరీపై కేసు

చాగల్లు: కోకో గింజల చోరీపై రైతు కొండేపాటి ఫణి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు చాగల్లు ఎస్సై పి.నాగరాజు తెలిపారు. చాగల్లు మండలం కలవలపల్లి గ్రామానికి చెందిన ఫణిప్రసాద్ తోటలో ఉంచిన సుమారు రూ. 3లక్షల విలువైన కోకో గింజలను ఈ నెల 9వ తేదీ గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు. చోరీకి సంబంధించి రైతు శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడికి చెందిన దంగేటి వెంకట సురేష్(27)అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ నెల 14న అప్పుల బాధ తాళలేక పురుగు మందు తాగాడు. ఎస్ఐ బి.రాజేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాల పక్కన గుర్తు తెలియని మృతదేహం


నిడదవోలు – చాగల్లు మధ్య పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

చాగల్లు: నిడదవోలు – చాగల్లు మధ్య పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. తాడేపల్లిగూడెం ఆర్పీఎస్సై జి.శ్రీహరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 7వ తేదీ ఉదయం చాగల్లు – నిడదవోలు రైల్వే స్టేషన్ల మధ్య విజయవాడ వైపు పోయే ట్రాక్ పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించామన్నారు. సుమారు 30–40 సంవత్సరాల వయసు, ఛామన ఛాయ కలిగిన పురుషుని మృతదేహం అన్నారు. మృతుడు తెలుపు రంగు కట్ బనియన్, నీలం రంగు జీన్స్ ప్యాంట్, పచ్చరంగు ఫుల్ కట్ డ్రాయర్ ధరించినట్లు చెప్పారు. మృతుని వివరాలు తెలియరాలేదని, మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మార్చురీ రూమ్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ ఎస్సై శ్రీహరిబాబు తెలిపారు. మృతుని వివరాలు తెలిస్తే 94906 17090, 70133 60296 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.